క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: మండలంలోని దేవరమదుగులు గ్రామ ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మత్తులు, తుప్పలు తొలగిస్తున్న కారణంగా ఆ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ దొర తెలిపారు. విద్యుత్‌శాఖ ఈఈ టి.గాబ్రియేల్ ఆదేశాల మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు దేవరమదుగులు ఫీడర్‌కు సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆత్మీయ సన్మానం



బీఎం సతీష్‌కుమార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కొయ్యూరు: గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్‌గా రెండు సంవత్సరాలు సేవలందించి బదిలీపై వెళ్తున్న జి.సతీష్ కుమార్‌ను సిబ్బంది తదితరులు గురువారం సన్మానించారు. విజయనగరం ఆర్‌వో కార్యాలయానికి ఆయన బదిలీ అయ్యారు. తెలంగాణలో ఆడిట్ విభాగంలో పనిచేసిన జి.గణేష్‌ను ఇక్కడకు బీఎంగా బదిలీ చేశారు. అతనితో పాటు ఫీల్డ్ అధికారిగా సీహెచ్.భాను ప్రకాశ్ బాధ్యతలు స్వీకరించారు. క్యాషియర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు



అన్నసమారాధనలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు వచ్చి తరలివచ్చి బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హారతి. భజనల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం జరిపారు. భారీ సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మారేడుబాకలో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని మారేడుబాక గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 108 సిబ్బంది గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 48 మంది రోగులు వచ్చారు. వారికి బీపీ, సుగర్ ఇతర పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్‌ఎం లక్ష్మి, 104 డీఈఓ శ్రీనివాస్, ఆశ, పైలట్ కనకరాజు పాల్గొన్నారు. మండలంలోని తాళ్ళపాలెం గ్రామంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు 104 డీఈఓ శ్రీనివాస్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

చింతపల్లి: చింతపల్లి మండల అంగన్‌వాడీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా కంకిపాటి రాములమ్మ, గెమ్మిలి ఇందుమతిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారితో పాటు కోశాధికారిగా సత్యవతి, ఐదుగురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, 23 మంది సభ్యులతో కమిటీ ఎన్నికయ్యారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పాఠశాల భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నూకరాజు, సర్పంచ్‌లు, నేతలు

కొయ్యూరు: మండలంలోని మూలపేట పంచాయతీలోని పాలమామిడిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు, డౌనూరు, మూలపేట సర్పంచ్‌లు పొట్టిక భవాని, రావుల సత్యవతి బుధవారం ప్రారంభించారు. గతంలో అప్పటి ఐటీడీఏ పీవో అభిషేక్ గ్రామాన్ని సందర్శించి, అక్కడి సమస్యను గుర్తించి, పాఠశాల భవన నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు భవనంతో పాటు వంటగదిని నిర్మించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపాలన్నారు. ఎంఈవో రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చింతపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



కామయ్యపేటలో థింసా నృత్యాలతో వినాయకుడి నిమజ్జనంలో గ్రామస్తులు




పెదబయలులో పూజలు చేస్తున్న భక్తులు



డుంబ్రిగుడలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు

ఏకదంతాయ.. వక్రతుండాయ

- ఘనంగా వినాయక చవితి పూజలు
- వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు



ముంచంగిపుట్టులో ఏర్పాటు చేసిన గణనాథుడు



పాడేరులో పూజలు చేస్తున్న భక్తులు



అప్పలరాజుపేటలో ప్రత్యేకాలంకరణలో గణనాథుడు



వై.రామవరం బస్టాండు వద్ద మండపంలో పూజలు చేస్తున్న భక్తులు

సాక్షి,పాడేరు: పార్వతీ తనయుడు మండపాల్లో కొలువుదీరాడు. విఘ్నాలు తొలగించే వినాయక చవితి వేడుకలను భక్తజనం ఘనంగా జరుపుకొంది. వరసిద్ధి వినాయకుడిని వాడవాడలా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మండపాల్లో వివిధ రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలను కొలువుదీర్చారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా ఊరువాడల్లో ఉత్సవ శోభ నెలకొంది. తెల్లవారుజాము నుంచి గణేష్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. గ్రామాల్లోని వీధుల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో ప్రత్యేకాలంకరణలో అలంకరించిన గణనాథునికి పూజలు చేశారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 11 అడుగుల గణనాథుడు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జంగంసరియాలో భారీ గణనాథుడును చూసేందుకు అధికంగా భక్తులు తరలి వస్తున్నారు.

హుకుంపేట: మండలంలోని మారుమూల గ్రామల సైతం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని కామయ్యపేటలో థింసా నృత్యాల నడుమ వినాయక విగ్రహ నిమజ్జనం సాగింది.

పెదబయలు: మండల కేంద్రంలో పది అడుగుల వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెదబయలు సి కాలనీ, ప్రధాన కూడలిల్లో విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని అరకు, కించుమండ, గుంటసీమ, సొవ్వా తదితర ప్రాంతాల్లో ఘనంగా వినాయక చవితి వేడుకలు జరిగాయి.

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదలవస, రంపుల, ఆర్.వి.నగర్, రింతాడ, గూడెం, ఏబులం తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు.

కొయ్యూరు: మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి గణనాథుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

చింతపల్లి: మండలంలోని లోతుగెడ్డ, తాజంగి, లంబసింగి, అన్నవరం, లోతుగెడ్డ జంక్షన్, రాజుపాకతో పాటు మండల కేంద్రంలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవాల్లో భజనలు, కోలాటాలు, అన్న సమారాధనలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

సీలేరు: సీలేరులో అల్లూరి వీధి, శివాలయం వీధి, దుర్గావీధి తదితర ప్రాంతాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంతో పాటు లోతట్టు ప్రాంతం అప్పలరాజుపేట, శరభవరం, జడ్డంగి, వట్టిగెడ్డ, దూసరపాము, చెరకుంపాలెం, వాతంగి, లోదొడ్డి, లాగరాయి, లబ్బర్తి తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాల్లో గణనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

వై.రామవరం: మండలంలో వినాయక చవితి వేడుకను ఘనంగా నిర్వహించారు.

ఎటపాక: చవితి వేడుకల్లో భాగంగా గురువారం పలుచోట్ల దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

కూనవరం: మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.



టేకులబోరులో గణనాథునికి పూజలు



గౌరిదేవిపేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



రాజేంద్రపాలెంలోని వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జీకే వీధిలో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు



జి.మాడుగుల పోలీస్ స్టేషన్‌లో పూజలు చేస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు, సిబ్బంది



సీలేరు అల్లూరి వీధిలో మండపంలోని వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



మాట్లాడుతున్న ఏవో భాను ప్రియాంక

కొయ్యూరు: రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందులు తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఏవో భాను ప్రియాంక సూచించారు. మండలంలోని సింగవరం రైతు సేవా కేంద్రంలో రాజేంద్రపాలెం రైతులతో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో ప్రకృతి సాగుపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం వల్ల భూసారం దెబ్బతినకుండా ఉంటుందని, ఫలితంగా పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. వ్యవసాయానికి మేలు చేసే అనేక రకాల కీటకాలు ఉంటాయన్నారు. రసాయన ఎరువుల మూలంగా భూమిని, పంటలను కాపాడే అనేక కీటకాలు నశిస్తున్నాయన్నారు. ప్రకృతి సాగులో పెట్టుబడి కూడా తగ్గుతుందన్నారు. సర్పంచ్ పి.సింహాచలం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అప్పలనాయుడు, వరలక్ష్మి, ఆత్మ బీటీ ఎం.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సాయంతో గంజాయిపై నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ హిమగిరి

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ మండలం అల్లూరి జిల్లాకే ఆదర్శం కావాలని, గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దుతామని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను బుధవారం తనిఖీ నిర్వహించారు. గతంలో పెండింగ్‌లో ఉన్న గంజాయి కేసులతో పాటు ఇతర కేసులను పరిశీలిస్తున్నామన్నారు. మండలంలోని గంజాయి జాడలు లేకుండా చూడాలని ఎస్ఐ కె.పాపినాయుడుకు ఆదేశించారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా డ్రోన్ కెమెరాలతో గంజాయి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో గంజాయితో పట్టుబడి బెయిల్‌పై బయట ఉన్నవారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. వాహనచోదకులు తప్పక హెల్మెట్ ధరించాలని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పోలీసు సిబ్బంది ధర్మేంద్ర, పురొంధర్ తదితరులున్నారు.

ముంచెత్తిన వర్షం

- రహదారులపై కూలిన చెట్లు
- విరిగిపడిన కొండచరియలు
- నిలిచిన రాకపోకలు



జీకే వీధిలో నేలకూలిన చెట్లు



కోతకు గురైన బాసెల రోడ్డు

కొయ్యూరు/పెదబయలు/గూడెం కొత్తవీధి/ముంచంగిపుట్టు/పెదబయలు/సీలేరు: జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. ప్రధాన రహదారుల్లో చెట్లు కూలడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో వరదనీరు నిలిచిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెదబయలు మండంలోని ఇనుపతీగల గ్రామంలో కొండచరియలు విరిగిపడ్డాయి. బాసెల– బొడ్డాగొంది ఘాట్ రోడ్డు కోతకు గురైంది. జీకే వీధిలోని రంపుల జాతీయరహదారిపై చెట్లు కూలడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంచంగిపుట్టు మండలంలోని జభడ గ్రామంలో, బూసిపుట్టు, బుంగాపుట్టులో గ్రామాల్లో భారీ వర్షాలకు పలుచోట్ల గిరిజనుల ఇళ్లు దెబ్బతిన్నాయి. సీలేరులో గురువారం మధ్యాహ్నం నుంచి వర్షం తెరిపిచ్చింది.



జభడలో వర్షానికి నేలమట్టమైన ఇళ్లు



సంతపాకలులో రహదారిని ముంచెత్తిన వర్షం

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ నియామకం



పాంగి పద్మారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు

ముంచంగిపుట్టు: వైఎస్సార్‌సీపీ ముంచంగిపుట్టు మండల కమిటీని వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం నియమించారు. మండల పార్టీ అధ్యక్షుడిగా పాంగి పద్మారావు, ఉపాధ్యక్షులుగా చెండా జగన్నాథం, నాయకం సుందరరావు, ప్రధాన కార్యదర్శులుగా ముఖి రాంప్రసాద్, తాలోయి భాస్కరరావు, చెండా పాపారావు, గోల్లోరి సన్యాసిరావు, కార్యదర్శులుగా మునుముల అప్పారావు, జనం తిరుపతి,వి.జీనబంధు,పాంగి సత్యారావు, గురుమూర్తిలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

సమస్యలతో సతమతం

- వండ్రంగిలో వంతెన లేక ఇక్కట్లు
- ప్రమాదకర గెడ్డలు దాటుతున్న గ్రామస్తులు
- అధ్వానంగా రహదారులు
- రాకపోకలకు అవస్థలు



గొందిపోలం రోడ్డు దుస్థితి



ఇందిరాకాలనీలో నిలిచిన వర్షపునీరు



వండ్రంగి-పినగరువు గ్రామాల మధ్య ప్రమాదకర గెడ్డను దాటుతున్న గిరిజనులు

జి.మాడుగుల: మండలంలో నుర్మతి పంచాయతీలో కొద్దిపాటి వర్షం కురిసినా వండ్రంగి–పినగరువు గ్రామాల మధ్య గెడ్డ పొంగి ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఈ గెడ్డపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు కురిసినపుడు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి గెడ్డ దాటడానికి సాహసం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం మినహా మిగిలిన రోజుల్లో కూడా విద్యార్థులు కాలినడకన పాఠశాలకు వెళ్లటానికి, గిరిజన ప్రజలు ఈ గెడ్డ దాటటానికి సమస్యలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వండ్రంగి–పినగరువు గ్రామాల మధ్య గెడ్డపై బ్రిడ్జి నిర్మించటానికి ప్రభుత్వం, ఉన్నతాధికార్లు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సీలేరు: ఏజెన్సీ మారుమూల గిరిజన ప్రాంతాల్లో వర్షం పడితే రాకపోకలు నరకంగా మారుతుంది. మండలంలో దారకొండ పంచాయతీ నుంచి వర్తండపాడు నుంచి భీముడుపాకల గ్రామం మీదుగా గొందిపాలెం వెళ్లే ఐదు కిలోమీటర్ల రహదారి వర్షాలు పడితే పూర్తిగా బురదగా మారి వాహనాలు వెళ్లలేని దుస్థితిలో ఉంది. గతేడాది రూ.1.25కోట్లతో మెటల్ రోడ్డు వేశారు. రహదారి పనులు అసంపూర్తిగా వదిలేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఆ ఐదు కిలోమీటర్లు తారురోడ్డు వేయాలని స్థానికులు గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని ఇందిరాకాలనీలో సీసీ రోడ్డు వేయాలని కాలనీ స్థానికులు కోరుతున్నారు. కాలనీలో వీధులన్ని సీసీ రోడ్డు లేక అధ్వానంగా ఉన్నాయని, వర్షకాలంలో బురద బురదగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడిపడితే అక్కడ నీరు నిలిచిపోతుందని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీసీ రోడ్డు సమస్యను అనేకసార్లు అధికారులకు తెలియజేసినా స్పందన లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్డు వేసేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గ్రామాల విలీనం కోసం వినతి



తహసీల్దార్ కన్నాజీరావుకు వినతి ఇస్తున్న గాలికొండ, ఏ.ధారకొండ సర్పంచ్ తదితరులు

గూడెంకొత్తవీధి: అమ్మవారి ధారకొండ, గాలికొండ పంచాయతీలు గూడెం కొత్తవీధికి సమీపంలో ఉండడంతో వాటిని జీకే వీధి మండలంలో కొనసాగించాలని కోరుతూ సర్పంచ్‌లు చంటిబాబు, కె.బుజ్జిబాబు గురువారం తహసీల్దార్ కన్నాజీరావుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల మండలాల విభజన కావడంతో కొందరు ధారకొండ కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని కోరుతున్నారని, దీనికి తమ రెండు పంచాయతీవాసులు సిద్ధంగా లేవన్నారు. పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కృష్ణారావు, చిట్టిబాబు, పండన్న తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు,కోర్టు సిబ్బంది

అడ్డతీగల: బాల్య వివాహాల నిరోధం అవసరం ఎంతైనా ఉందని అడ్డతీగల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం అడ్డతీగల సీహెచ్‌సీలో బాల్య వివాహాలు, ఎర్లీ ప్రెగ్నెన్సీ తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల శారీరక మార్పులపై సరైన అవగాహన లేని బాలికలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు.బాల్య వివాహం చేసుకున్నా లేక ప్రోత్సహించినా చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఎర్లీ ప్రెగ్నెన్సీ వల్ల రక్తహీనత ఇతరత్రా సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. వైద్యాధికారి హర్ష, అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆదికర్మయోగి అభియాన్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాదరావు, ఎంఈవో రాంబాబు

కొయ్యూరు: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో చేపట్టనున్న సమస్యల పరిష్కారానికి వివిధ శాఖల సిబ్బందికి ఎంపీడీవో కార్యాలయంలో ఆదికర్మయోగి అభియాన్ పథకంపై ఎంపీడీవో ప్రసాదరావు అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామాన్ని సందర్శించి ప్రజల అవసరాలు తీర్చడం దీని ప్రత్యేకత శిక్షణలో భాగంగా ఎంపీడీవో మాట్లాడుతూ చేపట్టాల్సిన చర్యలను సూచించారు. గ్రామాల్లో సర్వే చేపట్టి, ప్రజల అవసరాలపై వారి నుంచి ప్రణాళిక తయారు చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. కేంద్రం నిధులతో ఈ పనులను చేపట్టనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. అన్ని శాఖల అధికారులు దీనిలో పాల్గొవాలని ఆయన సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయి, ఎంఈవో రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, వర్కర్లు పాల్గొన్నారు.

ఎరువుల కొరత సమస్యను పరిష్కరించాలి

- ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: రంపచోడవరం మండలంలో ఎరువుల కొరతపై సంబంధిత శాఖాధికారులతో ఎంపీపీ బంధం శ్రీదేవి గురువారం సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రంపచోడవరం పీఏసీఎస్‌కు సంబంధించి ఎరువుల లైసెన్స్ కాలపరిమితి ముగియడంతో ప్రస్తుతం సరఫరా చేస్తే పరిస్థితి సాధ్యకాదన్నారు. ప్రైవేట్ వ్యాపారులు కూడా ఎరువులు బుక్ చేయడం , అమ్మకానికి సుముఖత చూపడం లేదన్నారు. దీనిపై ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ ఇలాంటి పరిస్థితిలో ప్రైవేట్ వ్యాపారుల లైసెన్సులను ఎందుకు రద్దు చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చి వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు. రంపచోడవరంలో ఎరువులు లభ్యంకాకపోవడంతో సమీపంలోని గోకవరం, కొత్తపల్లి, జగ్గంపేటకు స్థానిక రైతులు వెళ్తున్నారని, అయితే వ్యాపారులు ఎరువుల విక్రయానికి నిరాకరిస్తున్నారన్నారు. ఎరువుల కొరతపై జిల్లా వ్యవసాయ అధికారితో ఆమె ఫోన్‌లో మాట్లాడగా, నాలుగైదు రోజుల్లో పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు. ఈ సమాచారాన్ని గ్రామాల్లోని రైతులకు తెలియజేయాలని ఆమె చెప్పారు.

ఘనంగా మహాలక్ష్మి జాతర

ఎస్.రాయవరం: మండలంలోని వమ్మవరంలో గ్రామ ఇలవేల్పుగా పూజలందుకుంటున్న మహాలక్ష్మి అమ్మవారి పండగను గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. సాయంత్రం భారీ మందుగుండు సామగ్రి వెలిగించి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.